కథానిక

ద్విజిహ్వ

"జయంత"

"**కా**లకంఠుని నాగుసర్పము
బుసబుస మూడ్చి పడగ బుస్సంది
రెండునాల్కలు గండుమీసాలట్లు దూసింది
ఓహో చెవులు మోసింద"

ఎక్కడలేని ఉద్రేకం తెచ్చుకుని చదువుతున్నాడు రామారావు కవికొండలమహాకవి గీతాన్ని కామయ్య శ్రద్ధగా వింటున్నాడు తాను చూచుకుంటూన్న డ్రీలెక్కలు ప్రక్కన పెట్టి అల్లుడు మామగారికి భావకవిత్వం అంటే చెప్పి ఈ గీతాన్ని పఠిస్తున్నాడు సీత కూడా లోనుంచి వింటుం దనే రామారావు జోరుగా రాగం తీస్తున్నాడు

"రెండు నాల్కలు గండు మీసాలట్లు దూసింది"

"రెండు నాలికలే?"

"ఔనండి ఈ పదం ఎంత ఉచితంగా వుందో చూచారా ఇక్కడ? ఈ రోజుల్లో మనుష్యులకికూడా రెండు నాల్కలుంటున్నాయి"

కామయ్య పకపకా నవ్వాడ

"కొందరు ఎగట ఒకమాటా, వెనక ఇంకో మాటా ఆడతారు కొందరు ఇప్పుడోమాట అప్పుడోమాట చెబుతారు ఇదంతా సర్ప జాతే"

కామయ్య ముఖం వహించాడు తా నా జాతిలో చేర నన్నట్లు

"ఈనాడు బలహీనతని ఒట్టి మనిషి మారిపోతున్నాడు లోభత్వం, అసూయ, దిగులు మనిషిని మనిషిగా వుంచడం లేదు ఏ పెట్టెనో రాయినో చేసినా బాగుండును ఎవరికీ హాని కరంగా లేకుండా అలాకాక పెద్దమనుష్యుల మని చెప్పుకుంటూ స్వార్థపరులై తమ శ్రేయస్సుకోసం ఇతరుల కీడుని కాంక్షిస్తున్నారు చాలామంది"

"ఏదో నాయనా, ప్రపంచం అంతా పల్లకీ ఎక్కితే మోసే దెవరు?"

"అదే మెట్టవేదాంతం రోజులు మారాయి మారుతున్నాయి పల్లకీలు పోయి విమానాలు వచ్చాయి మోతగాళ్లు అవసరం లేదిక అలాగే మనస్సులు, పాతపంథాలు మారాలి ధనం యొక్క ఉపయోగం ప్రతీవాళ్లుఅనుభవించాలి"

కామయ్య మనస్సు చివుక్కుమంది అల్లుడు తననిగూర్చి మాట్లాడడం లేదుగదా!

రామారావు తనపెళ్లి జరిగినప్పటినుండీ కామయ్యలోభత్వాన్ని చవిచూచాడు నూతన దృక్పథం గల మనిషిగనక లెక్క చేయకపోయినా మామగారు తనకి వాగ్దానాలు చేసిన వస్తువులే ఇవ్వకపోవడం మరచిపోలేదు ఏమైతేనేం, సీతలో వుండే సుగుణాలు కామయ్య లోపాలన్నీ కప్పేస్తున్నాయి

పాట మళ్లీ మొదలు

"వాడి ముమ్మొన వాలు, హుతభుక్"

"అమ్మో, అమ్మో, పాము, పాము"

కామయ్య కంపించిపోయాడు రామారావు పుస్తకం మూసేసేడు ఆ కాలకంఠుని సర్పమే వచ్చిందా అనిపించింది అల్లుడు మామలకి జారిపోతూన్న పమిటనేనా సర్దుకోకుండా పరుగెత్తుకువచ్చింది సీత "నాన్నా, నాన్నా, వంటింట్లో కలుగులో పాము దూరింది రా, వేగంగా"

ఇద్దరూ లేచారు ఎలా పాకిందో ఈ సంగతి ఇరుగుపొరుగు వెంకన్నలో నలుగురు ప్రత్యక్షమయ్యారు క్షణంలో వంటగదిలో కలుగు మాత్రం వుంది కాని ఏమీ కనిపించదే! అయితేనేం సీతా, తల్లీ మాచారు పాము దూరడం పాముల నాగన్నకు కబురు పోయింది

* * * *

"కష్టం బాబూ కలుగు తవ్వి పట్టాలి ధరమం అయిదేనా యిప్పించాలి"

"అదెల్లా నాగన్నా, మే మేం కుబేరులమా? ఒక్క రూపాయి తీసుకో—"

"క్షమించాలండి తమ రియ్యకపోతే ఎవ రిస్తారు? మీ దాసుణ్ణి"

"అలా గనకు ఇంకో అర్ధ"

"కాదండి-నాయనగారు పిల్లలుగలవాణ్ణి విమప్పరుగుతో పని"

"కాదు ఆలస్యం చెయ్యకు మళ్లీ ఆ సర్పం గోడలో మాయమవ్వచ్చు రెండు రూపాయలిస్తాను కానీ"

"కిట్టదండి బాబయ్యా బరిమీదుంటే అలాగే అనొచ్చు అయిదురూపాయలకి తక్కువయితే నావల్ల కాదండి"

ఈ బేరంలో గంట గడిచింది చివరికి ఎలాగైతేనేం కామయ్య అయిదూ యివ్వడానికి వొప్పుకున్నాడు నాగన్న నాగస్వరం ఆరంభించాడు

* * * *

"ని క్కావలిస్తే పుచ్చుకో లేకపోతే మా నెయ్యి ఈరూపాయిమీద కాసీ యిస్తాను"

"ప్రభువులు కగుణించాలి అది నాగుబాము కాకపోడం నా తప్పుకాదు అథమం మూడు రూపాయలేనా యిప్పించండి"

"ఒక్క దమ్మిడీ దొరకదు"

"అదేం న్యాయం బాబయ్యా నే నేం కల గన్నానా?"

"న్యాయం లేదు గియం లేదు వెళ్లు నాకు పనుంది పో, పో, అక్కర్లేకపోతే ఈ రూపాయికూడా దొరకదు తీసే స్తాగా లేనేం విషం లేని ఈ గొడ్డుపాముని దయచెయ్యి"

సణుక్కుంటూ ఒక్కరూపాయితో నడచిపోయాడు నాగన్న రామారావు నిర్ఘాంతపోయాడు మామగారి రెండు నాలుకలు చూచి వెంకన్నలు బయటికి వచ్చి వెకిలిగా నవ్వుకున్నారు

* * * *

టంగు టంగ్ టంగ్ టంగ్

చేతిలో చెంబు అక్కడే జారిపోయింది ఆ చప్పుడు విని సీత పరుగెత్తుకొచ్చింది పెరట్లోకి మూడడుగుల సర్పం పండుకుని వుంది తండ్రి, కూతురూ లోపలికి పరుగెత్తుకు పోయారు "నిన్నటినుంచీ సర్పమేదో తన్ని పగబట్టిం దేమో" నని కామయ్య కంపించిపోయాడు

"మీ నాన్న నిన్న పాములవాణ్ణి దగా చేశాడు ఊరికే పోదు వాడి ఉసురు" అని రామారావు సీతచెవులో చెబుతున్నాడు ఇరుగుపొరుగు వెంకన్నలు తిరిగి సిద్ధమయ్యారు ఒక్కరికీ ధైర్యం లేదా పాముని సమీపించడానికి

* * * *

"నాచేతకాదు బాబయ్యా, నిన్నటితో తెలిసింది"

"అలా గనకు నాగన్నా ఇవిగో అయిదు రూపాయలు మళ్లీ పాము పారిపోతుంది"

మామగారు చెబితే వినని నాగన్న రామారావు చెబితే వప్పుకున్నాడు అయిదురూపాయలూ చేతిలో వేయించుకున్నాడు నాగస్వరం మొదలుపెట్టాడు ఆ పన్నగం పడగవిప్పి ఆడుతోంది అంతా దూరంగా నుంచుని చూస్తున్నారు నాగన్న పెట్టె పరిచాడు ఆ సర్పం నాగన్నవైపే చూస్తోంది చిరపరిచితునిలా నాగస్వరం ఆగింది ఆ పాము పెట్టెలో ప్రవేశించింది పెట్టె చంకని పెట్టి నాగన్న శలవు తీసుకుంటున్నాడు వెంకన్న అతన్ని అడుగుతున్నాడు-"ఇంత సులువుగా పట్టేవే! ఎప్పుడూ వినలేదు బరిమీద పాము ఇంత వేగం దొరుకుతుందని నీ మంత్రం గొప్పది నాగన్నా!"

నాగన్న నిజం దాచలేకపోయినాడు

"చిత్తం బాబూ, ఈ నాగరాజు మావాడే ఉదయం తప్పిపోయాడు మళ్లీ తన గూట్లో ప్రవేశించాడు నా తండ్రి మా ధనం ఆయనే"

కామయ్య నిర్ఘాంతపోయాడు

"అయితే, ఇదంతా నీ పన్నాగమే నిన్న సొమ్ము దొరకలే దని నీ పామునే మా పెరట్లో వదలిపెట్టా వన్నమాట"

"చిత్తం బాబయ్యా, 'చేసిన పాపం చెబితే పోతుంది'" అని అమాయకంగా నవ్వుకుంటూ నాగన్న వెళ్లిపోయాడు

రామారావు నాగన్న యుక్తిని మెచ్చుకున్నాడు అంతేకాదు గోడవతల వెంకన్నలు మాట్లాడుకుంటూంటే ఇవతల మామగారిని పిలిచి వినమన్నాడు కూడా

"రెండు నాలిక లున్న వాళ్లంతా యింతే నిన్న మూడు రూపాయ లిస్తే తీరిపోయేదానికి కామయ్య మొత్తం ఆరు రూపాయలు సమర్పించుకున్నాడు" అని వాళ్లు నవ్వుకుంటున్నారు

ఉరాషిమాటారో

మూలం
ఒక జపానుకథ

అనువాదం
తల్లాప్రగడ సూర్యగంగాధరరామారావు

పదునాల్గువందల సంవత్సరాలక్రితం సంగతి ఉరాషిమా అనే బాలుడు చేపలవేటకి బయలుదేరాడు మిట్టమధ్యాహ్నం బాగా ఎండగా ఉంది సుమినోతీరాన్ని విడిచి సముద్రం మధ్యకి వెళ్లాడు చాలాదూరంలో ఆకాశం సముద్రాన్ని తాకుతోంది కొన్ని తెల్లని మేఘాలు నీళ్లలోకి దూకుతున్నాయి పర్వతశిఖరాలు కొన్ని ఆకాశంలో కలిసిపోయి సరిగా కనిపించటంలేదు గాలి మందంగా వీస్తోంది

ఉరాషిమా గాలంవేసి చాలాసేపు చూశాడు గాలానికి కేదో తగిలిన ట్లయింది పైకి తీసి చూశాడు అదొక తాబేలు జలదేవతకి ప్రియమయిన జంతువు దానికి అపకారం చేయకూడదు దేవుళ్లని ప్రార్థిస్తూ నీటిలోకి వదిలాడు

అతని కింకేం దొరకలేదు ఆరోజుని చాలా వేడిగా ఉంది-సముద్రం, గాలీ, అన్నీ నిశ్శబ్దంగా ఉన్నాయి చల్లనిగాలి వీస్తూందేమో బోటులోనే నిద్రపోయాడు

ఇంతలోకి నీళ్లల్లోంచి ఒక స్త్రీ పైకి వచ్చింది నెమ్మదిగా అతన్ని తాకి లేపింది

"నేను ఈ జలదేవుని కూతుర్ని ఆశ్చర్యపడకు నీ దయకి మెచ్చుకుని మా నాన్న నీ దగ్గరికి పంపాడు నన్ను ఇవాళ నీవు ఒక తాబేలు ప్రాణాన్ని రక్షించావు మా దీవికి పోదాం నడు అక్కడ ఎప్పుడూ వేసంకాలమే ఉంటుంది సుఖంగా ఉందాం, రా"

ఉరాషిమా ఆమెకేసి ఆశ్చర్యంగా చూడ్డం మొదలెట్టాడు ఇంతవరకు ఇంత అందమైన స్త్రీని తనెప్పుడూ చూడలేదు కాని ఆమెని ప్రేమించలేకపోయాడు ఆ చల్లని సాయంకాలం ఇద్దరూ చెరో తెడ్డూ పుచ్చుకుని బోటుని నడుపుకొని పోయారు

ఎప్పుడూ వేసంకాలమే ఉండే ఆ దీవికి బోటుని తీసికెళ్లారు దూరంగా జలదేవుని భవనం కనిపిస్తోంది

వరుణుని పరిచారకులు పెళ్లిదుస్తుల్తో వచ్చారు తమ రాజుగారి అల్లునికి వందనాలర్పించారు

వరుణకన్య ఇపుడు ఉరాషిమాకి భార్య వివాహం అతివైభవంగా జరిగింది రోజూ కొత్త వింతల్ని చూసి ఉరాషిమా సంతోషిస్తున్నాడు

ఉరాషిమాకి ఎన్ని సౌఖ్యాలున్నా ఒక విషయానికి గుండెల్లో దిగులుగా ఉంది తలిదండ్రులు తనకోసం ఎదురుచూస్తుంటారు చివరకి భార్య నడిగాడు, ఓసారి తల్లినీ, తండ్రినీ చూస్తానని

వరుణకన్య ఈ మాటలకి విచారపడి యిలా అంది "మీరు వెళ్లిపోతా రంటే నాకు బాధగా ఉంది మళ్లీ తిరిగి రారేమో నని భయం వేస్తోంది నేను మీకో చిన్న పెట్టె యిస్తాను మీరు మళ్లీ నా దగ్గరకి రావడాని కది ఉపయోగిస్తుంది నేను చెప్పినట్లు చేయండి ఆ పెట్టెని ఎప్పుడూ తెరవవద్దు అది తెరిస్తే మళ్లీ మీరు నన్ను కలుసుకోలేరు"

ఆమె ఒక చిన్న పెట్టె యిచ్చింది దాన్ని సిల్కుతాళ్ల చేత కట్టేశారు ఈ పెట్టె, వరుణుని అంతఃపురంనుంచి తెచ్చిన కొన్ని ఆభరణాలు, ఉరాషిమా చేపలుపట్టేందుకు వెళ్లే దోవలో నున్న 'కెనగావా'అనే దేవాలయంలో ఇప్పటికీ ఉన్నాయి

ఉరాషిమా భార్యని ఓదార్చాడు ఎప్పటికీ ఆ పెట్టె తెరవననీ, అఖరికి తాళ్లనయినా వదులు చేయననీ వాగ్దానం చేశాడు ఉరాషిమా పెట్టె తీసుకొని ప్రయాణం సాగించాడు. అంతా నిశ్శబ్దంగా ఉంది ఎప్పుడూ వేసంకాలమే ఉండే ఆ దీవియొక్క ఆకారము మనోవీధిలో ప్రత్యక్షమయింది ఎదురుగా సముద్రం, ఆకాశం కలిసినచోట జపాన్ దేశపు నీలికొండలు కన్పిస్తున్నాయి తీరాన్ని చేరుకున్నాడు అతనికి ఆశ్చర్యం వేసింది తన తండ్రిపూరిగుడిసె లేదు అక్కడ యిళ్లున్నాయి అదీ ఒక వూరే కాని అన్నీ కొత్తగా ఉన్నాయి నేలమీద తనకి జ్ఞాపకం ఉన్న చిహ్నాలేవీ లేవు అందరిలోనూ, తనొక్క క్రొత్తవాడయాడు తండ్రి నివసించే చోటు కోసం వెతికి విసిగిపోయాడు కొందరు జాలరులు ఇతన్ని చూసి ఆశ్చర్యపోయారు

చేతితో కర్ర పట్టుకుని ఒక ముసలివాడు అక్కడికి వచ్చాడు "ఉరాషిమాకుటుంబం నివసించే యిల్లే"దని అడిగాడు ఉరాషిమా ముసలివాడు ఆశ్చర్యపోయాడు

"ఏవూరు మీది! నీకు అతని కథ తెలియదేమో నాల్గువందల సంవత్సరాలక్రితం చేపలు పట్టడానికి ఉరాషిమా సముద్రంమధ్యకి వెళ్లి అక్కడ నీళ్లలో మునిగిపోయాడు అతని జ్ఞాపకార్థం మేము ఇక్కడ ఒక సమాధి కట్టాము అతని యిల్లెక్కడ అనడుగుతావేం? మూర్ఖుడిలా ఉన్నావు" అతని అజ్ఞానానికి నవ్వుకుని ముసలివాడు వెళ్లిపోయాడు

తన జ్ఞాపకార్థం కట్టబడిన ఆ సమాధివద్దకు వెళ్లాడు తండ్రిది, తల్లిదీ, ఇంకా అనేకమందవీ గోరీలు అక్కడున్నాయి పాచిపట్టి వాటిమీద పేర్లు చదవడం కష్టంగా ఉంది

తనొక విచిత్రమయిన శక్తిచేతుల్లో కీలుబొమ్మనయినా నని తెలుసుకున్నాడో వెంటనే సముద్రతీరానికి నడిచాడు-తన భార్య యిచ్చిన పెట్టె చేతిలో నుంచుకొని

తన భార్యకిచ్చిన వాగ్దానం మరచి సిల్కుతాళ్లు విప్పి, నిర్లక్ష్యంగా పెట్టె తెరిచాడు!!

వెంటనే ఒక తెల్లని, చల్లని నీటియావిరి మేఘంలా నిశ్శబ్దంగా ఇవతలి కొచ్చింది నెమ్మదిగా దక్షిణాభిముఖంగా వరుణదేవుడిదీవి వైపుకు వెళ్లిపోయింది అంతకంటె ఆ పెట్లో ఇంకేం లేదు!

తన సౌఖ్యం తనే నాశనం చేసుకున్నానని అప్పుడు తెలిసికొన్నాడు తన భార్యవద్దకు ఈ జీవితంలో వెళ్లలేడు నిరాశతో పెద్ద కేకవేసి గట్టిగా ఏడ్వడం మొదలెట్టాడు

ఒక క్షణం గడిచింది ఆశ్చర్యం!!! అతని ఆకారం పూర్తిగా మారిపోయింది పళ్లన్నీ ఊడిపోయాయి తల ముగ్గుబుట్టలా నెరసిపోయింది ముఖం ముడతలుపడింది వేళ్లు కొంకర్లు పోయాయి బలం క్షీణించిపోయింది నిర్జీవమైన ఆ శరీరము నాలుగువందల శీతాకాలాల్ని చూస్తూ ఇసుకలో పడి ఉంది

నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది మేహము, వికారము, విమత్తువ, శుక్లనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు 3-4-0 పోస్టేజి 10 అ॥

పి. సి. ఏ & కంపెని పెరిదేపి-నెల్లూరు జిల్లా

బ్రాంచి 7 సీను మొదలి వీధి, మద్రాసు.